నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, బుధవారం 25 డిసెంబర్ 2024 | MEDAK


# హ్యాపీ క్రిస్మస్..మేరీ క్రిస్మస్

**క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు**



సిద్దిపేట, డిసెంబర్ 24: ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలకు, క్రైస్తవులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమభావాన్ని, సేవాతత్పరతను, క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ క్రైస్తవులందరికీ శుభం చేకూరాలని ప్రభును ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవులందరూ సుఖసంతోషాలతో వేడుక జరుపుకోవాలని కోరారు. క్రీస్తు దీవెనలు ప్రతిఒక్కరికీ లభించాలని, సంతోషంగా జీవించాలని పేర్కొన్నారు.

# నేడు క్రిస్మస్..సర్వం సిద్ధం

- అంగరంగవైభవంగా మెదక్ చర్చి వందేండ్ల పండుగ ఉత్సవాలు
- విద్యుద్దీపాలతో చర్చి అలంకరణ
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- వసతులు కల్పించిన అధికారులు
- ఉదయం 4.30 నుంచి ప్రత్యేక ప్రార్థనలు
- వందేండ్ల వేడుకలకు హాజరుకానున్న సీఎం రేవంత్



విద్యుత్ కాంతుల్లో మెదక్ చర్చి

మెదక్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ)/మెదక్ రూరల్: చారిత్రాత్మక మెదక్ చర్చి వందేండ్ల ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. లోక రక్షకుడు ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ చర్చిలో బుధవారం తెల్లవారుజాము నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. ప్రపంచంలోనే మెదక్ చర్చికి ప్రత్యేకత ఉంది. అద్భుతమైన కళాకృతులతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీనిని నిర్మించారు. క్రిస్మస్ వేడుకకు లక్షలాది మంది భక్తుల రానుండడంతో మెదక్ డయాసిస్ మిషనరీ ప్రతినిధులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయనుండగా, బుధవారం తెల్లవారుజాము నుంచే చర్చి ద్వారాలను తెరిచి ఉంచుతారు. ఉదయం 4.30 గంటలకు మొదటి ఆరాధన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులనుద్దేశించి వ్యాక్యోపదేశం చేస్తారు. అనంతరం 10 గంటలకు రెండో ఆరాధనలో చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవసందేశం వినిపించనున్నారు.

### తొలిరోజు లక్షలాది మంది భక్తులు

ఉదయం నుంచి సాయంత్రం వరకు పాస్టర్లు భక్తులకు దీవెనలు అందజేస్తారు. క్రిస్మస్ వేడుకలకు మెదక్ డయాసిస్ పరిధిలోని పాత ఉమ్మడి జిల్లాలైన మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన క్రైస్తవులే కాకుండా కుల మతాలకతీతంగా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు, సందర్శకులు తరలిరానున్నారు. విదేశాల నుంచి సైతం పర్యాటకులు, భక్తులు హాజరై చర్చిని సందర్శిస్తారు. తొలిరోజు లక్ష మంది వరకు భక్తులు రావచ్చని డయాసిస్ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

### వసతి సౌకర్యాలు

మెదక్ సీఎస్ఐ చర్చికి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం వసతి గృహాల మేనేజర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వెస్లీ కళాశాల, గోల్ బంగ్లా, సండే స్కూల్, బిషప్ బంగ్లా, పర్యాటక అతిథి గృహంతో పాటు సీఎస్ఐ వసతి గృహాలను సిద్ధం చేశారు. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్చి పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో చర్చి ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

### విద్యుత్ కాంతుల్లో మెదక్ చర్చి...

మెదక్ చర్చిలో వందేండ్ల క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రతినిధులు మహాదేవాలయ ప్రాంగణం, పరిసరాలను అందంగా అలంకరించారు. రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణలతో చర్చి కొత్త కాంతులను విరజిమ్ముతోంది. ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, పునరుత్థానానికి చిహ్నంగా ఏర్పాటు చేసిన నక్షత్రాలతో మహా దేవాలయం కొత్త శోభ సంతరించుకుంది.

### ప్రత్యేక బస్సులు

మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు మెదక్ డిపో మేనేజర్ తెలిపారు. సికింద్రాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్, ఎల్లారెడ్డి, నర్సాపూర్, బొడ్మట్ పల్లి నుంచి అదనంగా బస్సులు నడుపుతామన్నారు. ఏఏ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది భక్తులు చర్చికి వస్తారో ఆ ప్రాంతాల నుంచి ఎక్కువ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

### నేడు మెదక్ చర్చికి సీఎం రేవంత్ రాక

బుధవారం జరిగే మెదక్ చర్చి వందేండ్ల వేడుకలతో పాటు క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ముందుగా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తారు.

# మెదక్ జిల్లాలో నేడు సీఎం పర్యటన

**ఏడుపాయల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్**



ఏడుపాయల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం, మెదక్ చర్చిని సీఎం దర్శించుకోనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ చేసి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఏడుపాయలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీఎం బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:40 గంటల వరకు మెదక్ జిల్లా పర్యటన కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 10.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట్ విమానాశ్రయం నుంచి సీఎం బయలుదేరుతారు. 11 గంటలకు కొల్చారం మండలం చిన్నఘణాపూర్ గ్రామం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.05 ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి చేరుకుంటారు. 11.10 నుంచి 11.30 వరకు వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకుంటా రు.11.30 నుంచి 11.40 గంటల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు. 11.45 గంటలకు వందేండ్ల మెదక్ చర్చి వేడుకలకు హాజరవుతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.25 వరకు చర్చిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 12.25 గంటలకు జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకొని 12.40 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సీఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నగేశ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.




వీరన్నగూడెంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం

# బల్దియా వద్దేవద్దు..!

- 28 వేల జనాభాతో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- జాతీయరహదారికి సమీపంలో ఉన్న ఐదు మేజర్ జీపీలను విలీనం చేసే అవకాశం
- విముఖత చూపుతున్న ప్రజలు

## నూతన మున్సిపాలిటీగా గుమ్మడిదల



గుమ్మడిదల మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

గుమ్మడిదల, డిసెంబర్ 24: హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న గుమ్మడిదల మేజర్ గ్రామ పంచాయతీ, గడ్డపోతారం మేజర్ గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలుగా ఏర్పాటు కానున్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే గుమ్మడిదల మున్సిపాలిటీలో అన్నారం, దోమడుగు, బొంతపల్లి, వీరన్నగూడెం తో కలిసి ఐదు గ్రామ పంచాయతీలతో కొత్త మున్సిపాలిటీగా గుమ్మడిదలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. 28 వేల జనాభా కలిగిన ఈ ఐదు గ్రామ పంచాయతీలతో మున్సిపాలిటీగా మార్చనున్నట్లు తెలిసింది. ఈ కొత్త మున్సిపాలిటీలో బొంతపల్లి, దోమడుగు, అన్నారం పారిశ్రామికవాడలు కావడంతో కొత్తగా ఏర్పాటు జరిగే మున్సిపాలిటీగా మంచి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ పారిశ్రామికవాడలో చిన్న పరిశ్రమలు 30, భారీపరిశ్రమలు 35 కుపైగా ఉన్నాయి. దీంతో ఈ మున్సిపాలిటీకి పన్నుల రూపంలో భారీగా ఆదాయం అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. గుమ్మడిదలలో ఓటర్లు 7050, బొంతపల్లిలో 6వేలు, అన్నారంలో 4800,దోమడుగులో 4 వేలు, వీరన్నగూడెంలో 1200 ఓటర్లు ఉన్నారు. 28వేల జనాభా ఉంది. గుమ్మడిదల వ్యవసాయాధారిత గ్రామంగా పేరుగాంచింది. మిగిలిన గ్రామాల్లో పరిశ్రమలు ఉండడంతో ఈ గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పరిశ్రమలో పనిచేసుకుంటున్న వారి జనాభా కూడా అధికంగానే ఉంది. ఇటీవల శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయనున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. మంత్రి ప్రకటనపై ఇక్కడి గ్రామాల ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. మున్సిపాలిటీగా మారితే పన్నుల భారం పడుతుందని ప్రజలు మున్సిపాలిటీ ఏర్పాటుపై విముఖత చూపుతున్నట్లు తెలిసింది.

### డంపింగ్‌యార్డు కోసమేనా..?

జీహెచ్‌ఎంసీ జవహర్ నగర్ చెత్తశుద్ధి కేంద్రంపై భారం తగ్గించడానికి మరోచోట డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. దీనికి అనువైన స్థలాలను గుర్తించింది. హైదరాబాద్ మహానగరంలో ఉన్న 17 మున్సిపాలిటీల చెత్తను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తుండడంతో నిత్యం 9వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు చేరుతున్నాయి. దీనిపై భారం తగ్గించడానికి హైదరాబాద్‌కు సమీపంలోని గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో 152 ఎకరాలను సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు గుర్తించారు. అప్పట్లో డంపింగ్ యార్డు ఏర్పాటుపై గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీలు, మండల పరిషత్ ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించి ఏకగ్రీవ తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపారు. తిరిగి కాంగ్రెస్ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ డంపింగ్‌యార్డు ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. గతంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకించి ప్రజాప్రతినిధులతో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ చర్చించినట్లు తెలిసింది. కానీ, ప్రజాప్రతినిధులు, నాయకులు ససేమిరా అనడంతో కాంగ్రెస్ సర్కారు కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు ఆలోచన ముందుకు తెచ్చిందని నాయకులు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు అంగీకరిస్తే ఓకే, లేకపోతే మున్సిపాలిటీగా మార్చి బలవంతంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### మున్సిపాలిటీ వద్దు..

తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ గుమ్మిడిదల మండలంలోని వీరన్నగూడెం, నాగిరెడ్డిగూడెం, వీరారెడ్డిపల్లి, రాంరెడ్డిబావి గూడెం కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. ఈ పంచాయతీలుగా ఏర్పాటు జరిగిన ఏడేండ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగింది. సీసీ రోడ్లు, కొత్త పంచాయతీలు, కమ్యూనిటీ భవనాలు, యూజీడీ పనులు, మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధిలో ముందుకు సాగాయి. ప్రజలకు పాలన చేరువ కావడంతో సంతోషించారు.ఇప్పుడు తమ గ్రామాలను మున్సిపాలిటీగా మారిస్తే పాలన దూరంతో పాటు పన్నుల భారం పడుతుందని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ ప్రకటనలో గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం పంచాయతీలు కలువనుండడంతో ఇక్కడి పంచాయతీల్లోని ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మున్సిపాలిటీ ఏర్పాటు వద్దని ఇటీవల మంత్రి దామోదర రాజనర్సింహను కొందరు కాంగ్రెస్ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు.

### భారం పడుతుంది..



గ్రామపంచాయతీగా ఉంటే ఏటా కేంద్ర నుంచి ఆర్థిక సంఘం ద్వారా నిధులు వస్తాయి. ఈ నిధులతో గ్రామాభివృద్ధి చేసుకోవచ్చు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. స్థానికంగా ఉన్న పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ఇంటి పన్నులు, ఆస్తి పన్నుల రూపంలో నేరుగా పంచాయతీల ఖజానాకు వస్తాయి. దీంతో గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి, గ్రామంలో పర్యావరణాన్ని పెంపొందించుకోవడం కోసం, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఖర్చు చేయవచ్చు. గ్రామాన్ని బల్దియాలో కల్పితే ప్రజలు ఈజీఎస్ పనులు కోల్పోతారు. ప్రజలకు పాలన దూరమవుతుంది. పన్నుల భారం పెరుగుతుంది. పర్మిషన్లు సులభంగా పొందలేము.

– పొన్నబోయిన వేణు, మాజీ ఎంపీటీసీ, వీరన్నగూడెం

### పంచాయతీ బెటర్..



కొత్తగా ఏర్పాటైన వీరన్నగూడెంలో కొత్తగా పంచాయతీ భవనం నిర్మించుకున్నాం. సీసీ రోడ్లు, యూజీడీ పనులు పూర్తి చేసుకుంటున్నాం. ప్రజలకు పాలన పరంగా అందరికీ అందుబాటులో ఉన్నాం. ఇక మున్సిపాలిటీలో కలిస్తే ప్రజలపై పన్నుల భారం పడుతుంది. పాలన దూరమవుతుంది. ఏ పని కావాలన్నా మున్సిపాలిటీకి పరుగులు తీయాల్సి వస్తుంది. మున్సిపాలిటీ నుంచి మా గ్రామాన్ని తప్పించాని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– పొన్నబోయిన మమత, మాజీ సర్పంచ్, వీరన్నగూడెం

# బస్టాండ్ ఆధునీకరణ పనుల పరిశీలన



హుస్నాబాద్ బస్టాండ్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, డిసెంబర్ 24: హుస్నాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫామ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు బిల్డింగ్‌కు సీలింగ్, గ్రీనరీ, సీసీ పనుల కోసం రూ.2కోట్లు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. వీటిని మంత్రి పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనులు ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 31వ తేదీలోపు పనులు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కంపుకొడుతున్న 'మార్కెట్ యార్డు'



ప్రహరీ చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారం



సదాశివపేట మార్కెట్ యార్డులో పందుల స్వైర విహారం

- సంగారెడ్డి జిల్లా సదాశివపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాల పారబోత
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- కరువైన అధికారుల పర్యవేక్షణ

సదాశివపేట, డిసెంబర్ 24: సదాశివపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం దుర్వాసనతో కంపుకొడుతున్నది. ఎక్కడపడితే అక్కడ కుళ్లిన వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. మార్కెట్ యార్డుకు ప్రహరీ లేక లోపల భాగం పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నది. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ పారవేయడంతో చెత్త పేరుకుపోతున్నది. పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రహరీ చుట్టూ చెట్లు పెరగడం, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండడంతో కొంత మంది ఇక్కడే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మార్కెట్‌కు నిత్యం వందలసంఖ్యలో రైతులు వస్తుంటారు. సివిల్ సప్లయ్, బియ్యం గోదాంలు ఉండడంతో కార్మికులు వస్తూపోతుంటారు. వెజ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూడా అసంపూర్తిగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువువడంతోనే మార్కెట్ కంపుకొడుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. యార్డులోనే మున్సిపల్ కార్యాలయం ఉంది. కానీ, నిర్వహణను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలిగించాలని పలువురు కోరుతున్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు అశోక్‌కుమార్**




సంగారెడ్డిలో బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 24: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 26న ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాలో జిల్లా నుంచి పెద్ద మొత్తంలో పాల్గొని విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు. 23 ఏండ్లుగా తక్కువ వేతనంతో పని చేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బందికి కనీస వేతన చట్టం అమలు చేసి సేవలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వారికి అన్నిరకాల సెలవులు మంజూరు చేయాలన్నారు. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసే పద్ధతిని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంతకుముందు సమగ్ర శిక్షా ఉద్యోగులు సంగారెడ్డి పట్టణంలో బోనాలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుములు రామచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు సంజీవయ్య, కంరోద్దీన్, మల్లికార్జున్, శ్రీనివాస చారి, పుండరీకం, జనార్దన్, గోపాల్, సంతోష్, శివశంకర్, నర్సింహులు, మల్లేశం పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

# నేడు మెదక్ చర్చికి ఎమ్మెల్సీ కవిత



మెదక్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు, క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హాజరవుతారని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మెదక్ చర్చిలో కల్వకుంట్ల కవిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్



సిద్దిపేట విక్టరీ చౌరస్తా వద్ద పని చేయని సిగ్నల్స్

రోజురోజుకూ విస్తరిస్తూ జనాభా వృద్ధి చెందుతున్న సిద్దిపేట పట్టణంలో అంతకంతకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతున్నది. నిత్యం కొత్త వాహనాలు పట్టణ రోడ్లపైకి వస్తున్నాయి. అనేక ప్రాంతాల నుంచి నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. సిద్దిపేట పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఆరు నెలల నుంచి పనిచేయడం లేదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి వాహనదారులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని విక్టరీ చౌరస్తా, పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నా, సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో కొందరు వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికేనా పోలీస్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసేలా చేసి ట్రాఫిక్‌ను నియంత్రించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, డిసెంబర్ 24



సిద్దిపేటలో పాత బస్టాండ్ వద్ద అలంకారప్రాయంగా సిగ్నల్స్



సిగ్నల్స్ పనిచేయక సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఆగిపోయిన ట్రాఫిక్



సిద్దిపేట విక్టరీ చౌరస్తా వద్ద పోలీసులు ఉన్నా అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనదారులు



సిద్దిపేట కూడళ్ల వద్ద పోలీసులు ఉన్నా ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు


